సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 16 । జూన్ । 2024



అప్రమత్తతే సురక్షితం

వానాకాలం విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వివరాలు 8లో ▸



చేపపిల్లల మృత్యువాత

మెదక్ పట్టణ సమీపంలోని పిల్లికుంటలో అధిక సంఖ్యలో చేపపిల్లలు మృత్యువాత పడ్డాయి.

వివరాలు 8లో ▸



పెసర సాగు.. రాబడి బాగు

పెసర పంటను తక్కువ పెట్టుబడితో సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చు.

వివరాలు 9లో ▸

పల్లెలంటే ఆట.. పాటలకు పుట్టినిల్లు. పచ్చని పంటలకు ఆనవాళ్లు. ఒకప్పుడు బావుల కాడికి పోవడం, చెట్ల దగ్గరికెళ్లి పండ్లు తెంపుకొని తినడం, ఆట పాటల్లో మునిగి తేలేవారు. సెలవులు వచ్చాయంటే చాలు అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లి పిల్లలు చేసే సందడి అంతా ఇంతా కాదు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, గోటీలు తదితర ఆటలతో సందడి కనిపించేది. కానీ, పాశ్చాత్య పోకడల ప్రభావం కారణంగా ఆటల సందడి కనుమరుగైంది. సెల్‌ఫోన్ల భూతం అడుగుపెట్టడంతో పిల్లలు ఆన్‌లైన్ 'గేమ్'వైపే మొగ్గు చూపుతున్నారు.

– గన్నె తిరుపతిరెడ్డి, దుబ్బాక

ఖేల్ ఖతం



పల్లెల్లో 'స్మార్ట్' బీమారీ

ఆటలను కబళిస్తున్న సెల్‌ఫోన్

- చిన్ననాటి నుంచే ప్రభావం
- వ్యాయామానికి యువత దూరం
- జీవన శైలిపై ఎఫెక్ట్
- మానసిక సమస్యలతో సతమతం



ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆన్‌లైన్ గేముల వల్ల యువత జీవన శైలి దారి తప్పుతోంది. మానసికంగా కూడా బలహీనులవుతున్నారు. ఆనాటి గ్రామీణ క్రీడలు ఆడిన యువత చాలా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండేవారు. అంతేకాకుండా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేవారు. కానీ రానురాను ఆ క్రీడలు కనుమరుగయ్యాయి.





ఏవీ నాటి ఆటలు?

పల్లెలో ఎన్నో రకాల ఆటలు కనిపించేవి. పిల్లలు చిర్రగోనే, కోతికొమ్మచ్చి, కచ్చకాయల ఆట, పైలా పచ్చీసు, గోటీలు, దాగుడు మూతలు, తొక్కుడు బిళ్ల, అష్ట చెమ్మ, బొమ్మరిల్లు ఆట, కైలాసం, చింతగింజలాట, పుంజీతం(చారుపత్తా), లింగోర్స, ఖోఖో, కబడ్డీతో పాటు చాలా రకాలు ఆటలు ఆడడటం కనిపించేవి. బాల్యంలో ఎక్కువగా బయటనే ఆటపాటలతో గడిపేవారు. పిల్లలు బావుల వద్దకు వెళ్లి ఈత నేర్చుకొని ఎంజాయ్ చేసేవారు. పల్లెటూర్లలో ఈతరాని చిన్నారులు చాలా తక్కువ. నేడు ఈత రాని వారి సంఖ్యనే ఎక్కువైంది. కబడ్డీ, వాలీబాల్ పోటీలు లేవు. ఇళ్లల్లో ఆడే క్యారం, చెస్ ఆటలు కూడా కనిపించడంలేదు. ఆటలతో పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎంతో పరిణితిచెందేవారు. నేడు ఆట పాటలు కనుమరుగవుతుండటం బాధాకరం.



వ్యసనాలకు యువత బలి

సెల్‌ఫోన్లలో వివిధ రకాల యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని వివిధ రకాల గేమ్‌లు ఆడుతున్నారు. బెట్టింగుల వల్ల ప్రతిరోజు యువత ఆర్థికంగా నష్టపోతోంది. అంతేకాక అప్పుల పాలై అమూల్యమైన తమ ప్రాణాలను బలి చేసుకుంటున్న ఘటనలు కోకొల్లలు. అనేక ఆటలు సెల్‌ఫోన్ల లోనే ఆడుతూ అన్ని రకాలుగా నష్టపోతున్నారు.



సెల్ ఫోన్లలోనే ఆటలు

చిన్నారులు ఎక్కువగా సెల్‌ఫోన్లలోనే గేమ్స్ ఆడుకోవడం చూస్తున్నాం. గూగుల్, యూట్యూబ్‌లను ఓపెన్ చేసి గంటల కొద్దీ ఆటలు ఆడుతుండటం గమనార్హం. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా టెక్నాలజీ పుణ్యామా అని సెల్‌ఫోన్లు రాజ్యమేలుతున్నాయి. ఏం కావాలన్నా ఫోన్లలోనే వెతుక్కుంటున్నారు. చివరకు వంటలు కూడా సెల్ చూసుకుంటూ చేయడం పల్లెల్లో ఫ్యాషన్‌గా మారింది.

సండే స్పెషల్





అనారోగ్య సమస్యలే అధికం



మొబైల్ ఫోన్లు అతిగా వాడడం వల్ల పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఫోన్ చూడడం వల్ల ఆలోచన శక్తి తగ్గి, మతి మరుపు వస్తుంది. ఫోన్ నుంచి వచ్చే బ్లూ లైట్ రేస్ వల్ల చర్మ, కళ్ల సమస్యలు వస్తాయి. చురుకుదనం తగ్గిపోతుంది. మెడ నొప్పి, తలనొప్పి, నిద్రలేమి, అలసట సమస్యలు తీవ్రమవుతాయి. శారీరక శ్రమ తగ్గి చిన్న తనంలోనే అనేక రుగ్మతలకు చేరువవుతారు. ఫోన్లలో ఆటలు ఆడకుండా మైదానంలో ఆడాలి. తద్వారా శారీరక ఎదుగుదలతో పాటు మంచి ఆరోగ్యవంతులుగా తయారవుతారు.

–హేమరాజ్‌సింగ్, ప్రముఖ సర్జన్, దుబ్బాక ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆటలతో దృఢత్వం



ఆటలతో శారీరకంగా, మానసికంగా పిల్లలు దృఢత్వంగా తయారవుతారు. 2018లో పాఠశాలల్లో లీడ్ ఇండియా ప్రోగ్రాం కింద చిర్రగోనే, గోటీలు, చారుపత్తా, రింగులు, దుంకుడు, కోతి ఆటలు ఉండేవి. దీంతో పిల్లలు ఆటలతో దృఢంగా ఉండేవారు. ఇప్పుడు అవి బంద్ కావడంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. పాఠశాలల్లో మళ్లీ ప్రవేశపెడితే పిల్లలకు చాల మేలు చేకూరుతుంది. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్లలో గేమ్‌లు ఆడుతూ ఆరోగ్యంగా, ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు పిల్లల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో కచ్చితంగా వారంలో ఒకరోజైనా ఆటలను తప్పనిసరిగా నిర్వహించాలి.

– కాసారం రమేశ్‌గౌడ్, పీడీ (ఫిజికల్ డైరెక్టర్)

న్యూస్‌రీల్

టీబీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కృష్ణ

పటాన్‌చెరు టౌన్ : క్షయ వ్యాధిపై ప్రతీ ఒకరు అవగాహన కలిగి ఉండాలని టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధి, జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ తెలిపారు. శనివారం మండల పరిధి ఇస్నాపూర్ సమీపంలోని హిండ్ వేర్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులకు టీబీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తెమడలో రక్తం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సిబ్బంది దేవేందర్ రాజ్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

- ఆర్‌జేడీ మోతి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ మోతి

జహీరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఐసీడీఎస్ ఆర్‌జేడీ మోతి ఆదేశించారు. శనివారం మండలంలోని రంజోల్ గ్రామంలోని సబ్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. అనంతరం జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్–2 అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. అక్కడ పిల్లల బరువు, ఎత్తును కొలిచి క్రాస్ చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్, మ్యానువల్ రికార్డులను పరిశీలించారు. సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ అధికారి శోభ, సీడీపీఓ సునీతబాయి, సూపర్‌వైజర్లు టి.అంజమ్మ, ఎం.సునీత, టి.నీరజగ్రేసి, అనితకుమారి, సద్గుణ, విజయ, రాధమ్మ, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి టౌన్ : చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించే నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసు గల పిల్లలు 4,05,207 మంది ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ప్రతీ ఒక్కరికి మాత్రలు అందించాలని అన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పేరుతో వ్యాపారం



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్ : నూతన విద్యా సంవత్సరం మొదలుకాక ముందే ప్రైవేట్ స్కూల్స్, కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆరోపించారు. అడ్డగోలుగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పద్మజారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది విచ్చలవిడిగా ఫీజులు పెంచుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, నాయకులు అశోక్, కృష్ణ, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరుచుకున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ

జహీరాబాద్ టౌన్: రెండు నెలల నుంచి మూతబడిన ఈఎస్ఐ డిస్పెన్సరీ ఎట్టకేలకు తెరుచుకుంది. శనివారం ఆస్పత్రిని ఓపెన్ చేయడంతో సీఐటీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 5 వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వారి వైద్యం కోసం జహీరాబాద్ పట్టణంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. సొంత భవనం లేక ప్రారంభం నుంచి అద్దె ఇంటిలో దీనిని కొనసాగించారు. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్ల నుంచి అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని డిస్పెన్సరీకి తాళం వేశాడు. దీంతో కార్మికులు వైద్యం కోసం ఇబ్బంది పడ్డారు. ఈ విషయంపై సీఐటీయూ నాయకులు ఆందోళనలు నిర్వహించారు. ఉన్నత అధికారులు స్పందించి డిస్పెన్సరీని తెరిపించారు. ఇప్పటికైనా సొంత భవనం నిర్మించి 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని జిల్లా కార్యదర్శి మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చెరకు రైతు సమస్యలు పరిష్కరిస్తాం

కేన్ అధికారుల భరోసా

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కేన్ అధికారులు ఆరా తీశారు. శనివారం రాయికోడ్ మండలం మాటూర్‌లో కొత్తగా నిర్మిస్తున్న చక్కెర కర్మాగారాన్ని డిప్యూటీ కేన్ కమిషనర్లు సీహెచ్.నర్సిరెడ్డి, ఎస్.శ్రీనివాస్‌లు సందర్శించారు. అనంతరం జహీరాబాద్‌లోని సీడీసీ కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. జోన్ పరిధిలో ప్రధానంగా నెలకొన్న సమస్యల గురించి అడిగితెలుసుకున్నారు. కూలీల కొరత అధికంగా ఉందని, లారీలు సైతం దొరకని పరిస్థితి ఉందని రైతులు వివరించారు. ప్రస్తుతం పక్క రాష్ట్రాల కర్మాగారాల యాజమాన్యం కూలీలు, లారీలతో వచ్చి చెరకును తీసుకెళుతుందని వివరించారు. పక్క రాష్ట్రాలకు చెరకు తరలిపోకుండా ఉండాలంటే కూలీలు, లారీలు సమకూర్చాలని తెలిపారు. చెరకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. అనంతరం మాటూర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న చక్కెర కర్మాగారం నిర్మాణ పనులను వారు పరిశీలించారు. వచ్చే సీజన్‌లో క్రషింగ్ చేయడం వీలవుతుందా అని యాజమాన్య ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. 2,500 సామర్థ్యంతో నిర్మిస్తున్న కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభం అయితే కొత్త జోన్ పరిధిలోకి వెళ్లే ఆయా మండలాల్లోని రైతులకు ఇబ్బందులు తప్పుతాయని కేన్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బోధన్, సంగారెడ్డిలకు చెందిన అసిస్టెంట్ కేన్ కమిషనర్లు వెంకటరవి, రాజశేఖర్, రైతులు ఎం.పాండురంగారెడ్డి, గుండ్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సీడీసీ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న కేన్ డిప్యూటీ కమిషనర్లు


గోవధను అడ్డుకోవాలని వినతి



డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని శనివారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ.. ఏటా బక్రీద్ పండగకు వేలాది గోవులను వధిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారి, పూల సంతోష్, నరేష్ పాటిల్, విశ్వనాథ్ యాదవ్, అరుణ్, ఓంకార్ యాదవ్, దుర్గయ్య, విశ్వనాథ్ స్వామి, శ్రవణ్, అనితపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



బీజేపీలో చేరుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయటంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. మండలంలోని బొల్లారంకు చెందిన బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌చారితో పాటు పలువురు నాయకులు శనివారం బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హత్నూరకు రాష్ట్రస్థాయి అవార్డులు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర మహిళా గ్రామైక్య సంఘానికి బ్యాంకు లింకేజీ రికవరీలో 100% సాధించడంపై మూడు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కించుకుంది. శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రి సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి సందీప్ కుమారి సుల్తాని ఈ అవార్డులను అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో హత్నూర మహిళా గ్రామైక్య సంఘానికి 99 లక్షలు బ్యాంకు లింకేజీ టార్గెట్ అధికారులు ఇచ్చినప్పటికీ నాలుగు కోట్ల 3 లక్షల రూపాయలను బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించి పూర్తిస్థాయిలో 100% రికవరీ చేయడం జరిగింది. దీంతో రాష్ట్రస్థాయిలో బ్యాంక్ లింకేజీ కింద మహిళ సమైక్య సంఘం అధ్యక్షురాలు కడల రాణి, కార్యదర్శి ఆకుల అపర్ణకు అవార్డు అందజేయడంతో పాటు పూర్తిస్థాయిలో బ్యాంకు రుణాలు రికవరీ చేయించినందుకు సీసీ మహేష్, వీఓ ఏ.లక్ష్మయ్యకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందజేసింది.



అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

డీసీసీబీకి అభినందనలు

సంగారెడ్డి : ఉమ్మడి జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు ఇవ్వడంతో డీసీసీబీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు హైదారాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి భవనంలో శుక్రవారం మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈఓ శ్రీనివాస్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు శనివారం మంత్రి దామోదర రాజనర్సింహను చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సీఈఓ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీసీబీ పాలక వర్గంతో పాటు అధికారులను మంత్రి అభినందించారు. 2023 –24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ద్వారా 7,500 స్వయం సహాయక సంఘాలకు రూ.450 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను అందజేశారు. రాష్ట్రంలోని అన్ని డిసిసిబి బ్యాంకులతో పోలిస్తే అత్యధికంగా రుణాలు ఇచ్చిన ఉత్తమ బ్యాంకుగా అవార్డు పొందింది.



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన చిట్టి దేవేందర్ రెడ్డి

హెచ్‌ఎంఎస్‌పై సీఐటీయూ ఘన విజయం

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని వరుణ్ బేవరేజెస్ పరిశ్రమ (పెప్సీ)లో జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం సాధించింది. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరిగింది. పరిశ్రమలో 201 మంది కార్మికులు ఓటు హక్కు కలిగి ఉండగా, 199 మంది ఓటేశారు. ఇందులో సీఐటీయూకు 129 ఓట్లు రాగా, హెచ్‌ఎంఎస్‌కు 70 ఓట్లు వచ్చాయి. హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ పై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు 59 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సీఐటీయూ గెలుపొందడంతో కార్మికులు కంపెనీ ఎదుట సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ 22 ఏళ్లుగా పెప్సీ కంపెనీలో సీఐటీయూ గెలుస్తూ కార్మికుల హక్కులను కాపాడుతుందని గుర్తు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ. మల్లేశం, కార్యదర్శి జి.సాయిలు, యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలరాజు, రవీందర్ రెడ్డి, భీంరెడ్డి, ప్రేమ్‌కుమార్, షఫీ, పవన్ కుమార్, శివ, సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.



సంబరాల్లో సీఐటీయూ నాయకులు

క్లుప్తంగా

సర్కిల్ వాల్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వెళ్లిన ఓ కారు రేడియల్ రోడ్డుపై సర్కిల్ వాల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన తెల్లాపూర్‌లో శనివారం జరిగింది. కొల్లూర్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మూసాపేట్ ప్రాంతానికి చెందిన చంద్ర జీహెచ్‌ఎంసీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 5గంటల సమయంలో తన మిత్రుడితో కలసి కారులో ఇందిరానగర్ నుంచి తెల్లాపూర్ వైపు బయలుదేరాడు. మితిమీరిన వేగంతో వెళ్లి రోడ్డుపై ఉన్న సర్కిల్‌ను ఢీకొట్టాడు. దీంతో కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు నడుపుతున్న చంద్ర మద్యం తాగినట్టు పోలీసులు తెలిపారు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ప్రయివేట్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్ విక్రయిస్తూ, ట్యూషన్ ఫీజులు, అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు డీఈఓ వెంకటేశ్వర్లు శనివారం మూడు స్కూళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ పీపీ రాథోడ్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్, శిశు విహార్ స్కూల్, అమీన్‌పూర్ పరిధిలోని శ్రీనిధి గ్లోబల్ స్కూళ్లకు నోటీసులు అందజేశారు.

పోక్సో కేసులో మహిళ అరెస్టు

సిద్దిపేటకమాన్: పోక్సో కేసులో నిందితురాలైన ఓ మహిళను టూటౌన్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సోలంకి అలియాస్ గైక్వాడ్ రాధ తన భర్త విజయ్, వారి పిల్లలతో కలిసి హనుమాన్ నగర్‌లోని ఓ ఇంట్లో మూడు సంవత్సరాల నుంచి అద్దెకు ఉంటోంది. ఆమె ఇంటి యజమాని కుమారుడైన బాలుడికి మాయమాటలు చెప్పి శారీరక సంబంధం కొనసాగించింది. ఈ క్రమంలో వారింట్లో బంగారం, నగదు తెప్పించుకుని తన భర్త, పిల్లలను వదిలేసి ఆ బాలుడితో గత జనవరి 22న చెన్నైకు వెళ్లిపోయింది. తన కొడుకు కనిపించడం లేదని బాలుడి తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తనను ఎలాగైనా పట్టుకుంటారని భావించిన మహిళ 11వ తేదీన బాలుడిని చెన్నై నుంచి తీసుకవచ్చి సిద్దిపేటలో వదిలిపెట్టడంతో అతడు తన ఇంటికి చేరుకున్నాడు. తర్వాత బాలుడు చెప్పిన సమాచారంతో దర్యాప్తుచేసి నిందితురాలిని పట్టుకున్నారు. శనివారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కంది(సంగారెడ్డి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల కేంద్రమైన కందిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం.. కందికి చెందిన మహమ్మద్ ఇంతియాజ్ సీసీ కెమెరాల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో వారం క్రితం కశ్మీర్ కు విహారయాత్రకు వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చాడు. తలుపులు తెరిచి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా 20సీసీ కెమెరాలు, 16 తులాల వెండి, రూ.12వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించాడు. బాధితుడు ఇంతియాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్రమత్తతే సురక్షితం



- విద్యుత్‌తో చెలగాటం వద్దు
- సొంత మరమ్మతులు అసలేవద్దు
- సిబ్బందితోనే రిపేర్లు చేయించాలి
- రైతులకు అధికారుల సూచనలు

వర్షాకాలం వచ్చిందంటే చాలు విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రజలు, రైతులు చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం సీజన్‌లో బోరు బావుల వద్ద విద్యుత్ మోటర్లు ఏర్పాటుచేసి రైతులు పంటల సాగుకు సిద్ధమవుతుంటారు. ఈ సమయంలో మోటర్ల వినియోగంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉండవచ్చు. అనుభవం లేకుండా ఫ్యూజులు మార్చడం, వీధి దీపాలకు, మోటర్లు, ఇంటిలోను మరమ్మతులు చేపట్టడం వల్ల ప్రమాదాల బారిన పడేఅవకాశం ఉంది. ప్రజలు, రైతులు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలని, వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

- దుబ్బాక టౌన్

వర్షా కాలంలో బలమైన గాలులు వీయడం వల్ల చెట్లు విరిగి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలు తలెత్తుతుంటాయి. దీంతో రైతులు చిన్నచిన్న మరమ్మతులు చేస్తుంటారు. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగేఅవకాశం ఉంది. ట్రాన్స్ ఫార్మర్ల ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోక షాక్ తగిలి ప్రమాదం చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ట్రాన్స్ ఫార్మర్లకు మరమ్మతులు చేయాల్సివస్తే విద్యుత్ సిబ్బందికి తప్పకుండా సమాచారం ఇవ్వాలి.

చార్జింగ్‌లో పెట్టి ఫోన్ మాట్లాడొద్దు

చాలామంది చార్జింగ్‌లో పెట్టి ఫోన్ మాట్లాడుతుంటారు. అలా చేయడం వల్ల ఫోన్‌పేలిపోయే అవకాశాలు ఎక్కువ. అలాగే ఇంటి వద్ద దుస్తులు ఆరవేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఆరవేయాలి. ఎక్కడైనా కర్రలకు విద్యుత్ వైర్లు బిగించి ఉంటే ఆయా ప్రదేశాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలను దూరంగా ఉంచాలి.

జాగ్రత్తలు తీసుకోకపోవడంతో..

దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన రైతు గణేశ్ శుక్రవారం సరైన జాగ్రత్తలు పాటించక ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ బిగించే సమయంలో షాక్‌తగిలి కుడిచేతికి గాయాలయయ్యాయి.



విద్యుత్ షాక్‌కు గురైన గణేశ్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

మోటర్ల విషయంలో జాగ్రత్తలు..

- ఎర్తింగ్ తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి
- వర్షం పడినప్పుడు స్విచ్‌బోర్డులు తడవకుండా చూసుకోవాలి
- ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్ బాక్స్‌ల చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించాలి
- తెగిన విద్యుత్ తీగలను తాకకూడదు. విద్యుత్ సిబ్బంది వచ్చేంత వరకు వాటి చుట్టూ ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలి
- పశువులను ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి



సాగుకు బోరును సిద్ధం చేసిన రైతులు

సమస్యలు తెలియజేయాలి



ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సిబ్బందికి తెలియజేయాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, స్విచ్‌లను తాకకూడదు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్స్‌లు, మోటర్ల వద్ద జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండదు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు.

– రామాంజనేయులు, విద్యుత్ ఏఈ, దుబ్బాక

యుద్ధ ప్రాతిపదికన పనులు



మెయిన్‌లైన్ విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న అధికారులు

- స్పందించిన విద్యుత్ అధికారులు
- కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

దుబ్బాక: 'బాబోయ్..హైటెన్షన్' పేరిట సాక్షిలో శుక్రవారం వెలువడిన కథనం విద్యుత్ ఉన్నతాధికారులను కదిలించింది. దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో ఏడాదికిపైగా గాలివానకు సిద్దిపేట నుంచి దుబ్బాక, దోమకొండ ప్రాంతాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు సరఫరాచేసే మెయిన్ లైన్‌లో డీపీ స్తంభాలు విరిగి ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో రైతులు బిక్కు బిక్కుమంటు గడుపుతూవచ్చారు. ప్రమాదకరంగా మారిన మెయిన్‌లైన్‌తో రైతులు పడుతున్న పరిస్థితిని శుక్రవారం సాక్షి వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన సిద్దిపేట ఎస్ఈ మోహన్‌రెడ్డి వెంటనే ప్రమాదకరంగా ఉన్న మెయిన్‌లైన్ డీపీ స్తంభాలను తొలగించి కొత్తవాటిని వేయాలని ఆదేశించారు. వెంటనే దుబ్బాక ఏడీ రాంబాబు, రూరల్ ఏఈ జయకృష్ణ, కాంట్రాక్టర్ గుర్రం వెంకట్‌రెడ్డి దగ్గరుండి పనులు పూర్తిచేయించారు. ఏడాదిగా ఉన్న ప్రధాన విద్యుత్ సమస్య కేవలం రెండు రోజుల్లోనే పరిష్కరించడం విశేషం.

అప్పనపల్లి గ్రామస్తుల కృతజ్ఞతలు

ఏడాదికి పైగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్‌తో ప్రతిరోజు ప్రాణభయంతో గడిపామని, ఇంతటి సమస్యను సాక్షి వెలుగులోకి తేవడంతో విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి రెండు రోజుల్లోనే పరిష్కరించడంపై అప్పనపల్లి గ్రామస్తులు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కష్టాలను వెలుగులోకి తెచ్చి పరిష్కరించేందుకు కృషిచేసిన సాక్షికి, అలాగే విద్యుత్ ఎస్ఈ మోహన్‌రెడ్డి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

- రూ.1.24లక్షలు రికవరీకి ఆదేశం
- కఠిన చర్యలు తీసుకుంటాం: ఏపీడీ



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

నంగునూరు(సిద్దిపేట): ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీడీ శివాజీ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ నంగునూరు మండలంలో 2023–24 సంవత్సరానికి గాను రూ.7,49,1,708 కోట్ల పనులు జరిగాయని, పనుల్లో పలు అవకతవకలు జరిగినట్లు తేలడంతో రూ.1,24,190 రికవరీకి ఆదేశించామన్నారు. ప్రతి కూలీకి పనికల్పించి మస్టర్లను సక్రమంగా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. మొక్కలను విద్యుత్ తీగల కింద నాటుతున్నారని పలు ఫిర్యాదులు అందాయని ముందుగా లొకేషన్ షేర్ చేసిన తరువాత మొక్కలను నాటాలని టీఏ, ఎఫ్‌ఏలకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ, అడిషనల్ జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఎస్‌ఆర్‌పీలు రవి, జీవన్, ఎంపీడీఓ వేణుగోపాల్, ఇంజినీర్ విభాగం కన్సల్టెంట్ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శశాంక్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లల మృత్యువాత

కలుషిత నీరా? విషం కలిపారా?

- ఉపాధి పోయిందని మత్స్యకారుల ఆవేదన



పిల్లికుంటలో చనిపోయిన చేపలు

మెదక్‌జోన్: పట్టణానికి ఆనుకుని ఉన్న పిల్లికొటాల్ శివారులోని పిల్లికుంటలో అధిక సంఖ్యలో చేపపిల్లలు మృత్యువాతపడ్డాయి. 60మంది మత్స్యకారుల కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. రెండు సంవత్సరాల క్రితం వదిలిన చేపపిల్లలు అరకిలో, గతేడాది ఆగస్టులో వదిలిన చేపపిల్లలు ఒక్కోటి 250 గ్రాముల వరకు పెరిగాయి. ఈ క్రమంలో మత్స్యకారులు చెరువులో నీరంతా ఎర్రగా మారడం, వేలాది చేపలు చనిపోతుతండడం గమనించారు. ఎవరో విషం కలపడం వల్లే చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా విషం కలిసిందని దానికి విరుగుడు కోసం మందు కలపాలని మత్స్యకారులకు అందజేశారు. అయితే ఆ మందును చెరువులో కలిపినప్పటికీ ఎలాంటి లాభం లేకుండా పోయిందని వాపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు. అయితే సమీపంలో ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నుంచి వచ్చే కలుషిత నీరు చెరువులో కలవడం వల్ల చేపలు చనిపోతున్నాయా? లేక ఎవరైనా విషం కలిపారా? అనే విషయం తెలియాల్సి ఉంది.

స్వర్ణకారులపై అక్రమ కేసులు సరికాదు

- 18న ఆమరణ నిరాహార దీక్ష
- విశ్వకర్మ సంఘం నేత నర్సింహాచారి



మాట్లాడుతున్న నర్సింహాచారి

కౌడిపల్లి(నర్సాపూర్): దొంగ బంగారం కొంటున్నారంటూ పోలీసులు స్వర్ణకారులపై అక్రమ కేసులుపెట్టి వేదించడం సరికాదని విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండోజు నర్సింహాచారి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కౌడిపల్లిలో మాట్లాడుతూ దొంగతనం చేసినవారిని వదిలిపెట్టి పోలీసులు స్వర్ణకాలను వేదిస్తున్నారని ఆరోపించారు. అలాగే వండ్రంగి వృత్తుదారులను అటవీశాఖ అధికారులు అక్రమ కలపఅంటూ వేదిస్తున్నారని, ఈ వేదింపులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. స్వర్ణకారులు, వడ్రంగి, చేతివృత్తులదారుల సమస్యల పరిష్కారం కోసం 18న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ఆమరణ నిరాహార దీక్షను విజయవంతం చేయాలని విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండోజు నర్సింహాచారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మం, రాందాస్, దశరథ, శ్యాములు, శ్రీనివాస్, కె.శ్రీనివాస్, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం ముఠా గుట్టురట్టు

- ఒకరి అరెస్టు..రూ.7లక్షల నగదు స్వాధీనం
- వివరాలు తెలిపిన రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): అమాయకులను లక్ష్యంగా చేసుకుని నకిలీ బంగారం అంటగట్టి లక్షలు దండుకుంటున్న ఓ ముఠా గుట్టును వర్గల్ మండలం గౌరారం పోలీసులు రట్టు చేశారు. ముఠా సభ్యుల్లో ఒకరిని అరెస్టుచేసి రూ.7లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. శనివారం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా శికారుపాలెం, పాళ్యంపల్లికి చెందిన ఎమ్.ఆదెప్ప రాజధానికి చెందిన ఇంద్రరాజు, మహిమరాజు, శివకృష్ణ, రాయిచోటికి చెందిన ఎమ్.నాయక్, చిన్నా ముఠాగా ఏర్పడి నకిలీబంగారం అంటగడుతూ మోసాలకు పాల్పడుతున్నారు. జేసీబీతో తవ్వుతుండగా బంగారం దొరికిందని, తక్కువ ధరకు అమ్ముతామంటూ నమ్మిస్తూ అమాయక ప్రజలను బురిడీకొట్టించి లక్షలు దండుకుంటున్నారు. ఆ ముఠా సభ్యుల్లో ఒకడైన మహిమరాజు నలభై రోజుల క్రితం జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలకు చెందిన బలిజగూడెం స్వామితో మాట కలిపాడు. జేసీబీతో మట్టి పనిచేస్తుండగా 3కిలోల బంగారు హారం దొరికిందని, తక్కువ ధరకే ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో స్వామి, అతడి మిత్రుడు వెంకట్ హారం కొనేందుకు సిద్ధమయ్యారు. రూ.20లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. గత నెల 28న వారు రూ.13లక్షలు ఇచ్చి 3కిలోల బంగారుహారం తెచ్చుకున్నారు. దానిని చెక్ చేయించగా నకిలీ బంగారమని తేలడంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం గౌరారంలోని రాఘవేంద్ర హోటల్ వద్ద ఎమ్.ఆదెప్పను ఎస్ఐ శివకుమార్ అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రూ.7లక్షలు నగదు, ఒక ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, త్వరలోనే ముఠాలోని మిగతావారిని పట్టుకుంటామని రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో గౌరారం ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

620 గ్రాముల గంజాయి పట్టివేత



నిందితుడితో పోలీసులు

పటాన్‌చెరు టౌన్: మెదక్ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 620గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ కథనం ప్రకారం.. ఇస్నాపూర్ దుర్గా వైన్ దుకాణం సమీపంలోని తేజ కాలనీ వద్ద ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం తెలుసుకున్నారు. దీంతో అధికారులు శుక్రవారం రాత్రి ఇస్నాపూర్ చేరుకొని అనుమానిత వ్యక్తి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సాజిద్ ఇక్బాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగ్‌లో 620గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్టు గమనించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

మనోహరాబాద్(తూప్రాన్)/నర్సాపూర్: ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు పరిశ్రమల వాడలలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని జీడిపల్లి శివారులో ఒడిశాకు చెందిన అక్షయ్‌నాయక్ గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నారన్నారు. అతడి వద్ద అరకిలో గంజాయి లభించిందని, దాని విలువ సుమారు రూ.50వేల ఉంటుదని చెప్పారు. అతడిని అరెస్ట్‌చేసి నర్సాపూర్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు తెలిపారు.

కాశీకి పార్థివ శివలింగాలు



మహిళా ప్రతినిధులు తయారు చేసిన పార్థివ శివలింగాలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో ఆర్య వైశ్య సంఘం మహిళా సభ్యులు తయారు చేసిన 75వేల పైగా శివ లింగాలను కాశీకి పంపించారు. గత నెల 10వ తేదీ నుంచి ఈనెల 11వరకు వాటిని తయారు చేశారు. సంఘం సభ్యులు రోజూ ప్రత్యేక పూజలు చేసి శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధి అశోక్ గుప్త ద్వారా వాటిని పంపించారు. నెలరోజులు శ్రమించి శివలింగాలను తయారు చేసిన మహిళలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు మల్లేశం, రమేశ్, సత్యనారాయణ, సంతోష్, చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు శ్రీవాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో చైన్ స్నాచింగ్ కలకలం

మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లిన దుండగులు



నిందితులుగా అనుమానిస్తున్న వారి ఫొటో

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. నడుచుకుంటూ వస్తున్న ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కడవేర్గు గ్రామానికి చెందిన నరకుల వీరమణి చేర్యాలలో ఉంటున్న కుమారుడి వద్దకు శనివారం ఉదయం వచ్చింది. అక్కడి నుంచి తన తల్లి వద్దకు వెళ్లింది. సాయంత్రం తిరిగి వెళుతున్న క్రమంలో స్థానిక వాసవీగార్డెన్ సమీపంలో వెనుక నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. ఆ గొలుసు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓ.దామోదర్ తెలిపారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ వారి సీసీ టీవీ ఫుటేజీ ఫోటోలను పోలీసులు విడుదల చేశారు. ఫోటోల ఆధారంగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్య

- విత్తనాలు చల్లే విషయంలో వివాదం



మృతుడు నారాయణ

దుబ్బాకరూరల్: పొలంలో వరి విత్తనాలు చల్లే విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆకారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ గంగరాజ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గరిగె నారాయణ(85) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరోగ్యం సహకరించక పోవడంతో ఇటీవల మతి స్థిమితం కోల్పోయాడు. వ్యవసాయం సరిగా చేయడంలేదని తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం పొలంలో విత్తనాలు చల్లే విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఇంటి ప్రక్కనే ఉన్న గడ్డివాము వద్ద ఉన్న చీరతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో గృహిణి..

దుబ్బాకటౌన్: మనస్తాపంతో గృహిణి ఉరివేసుకున్న ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం.. దుంపలపల్లి వార్డుకు చెందిన ధర్మారెడ్డి నవనీత్ రెడ్డి ఆరు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన సంతోషను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులున్నారు. నవనీత్ రెడ్డి ఉద్యోగ రీత్యా భార్యాపిల్లలలో కలిసి యాదాద్రి జిల్లాలోని తుర్కపల్లిలో జీవనం గడుపుతున్నాడు. సంతోష అప్పుడప్పుడు ఫిట్స్, ఛాతీనొప్పి, కడుపు నొప్పితో బాధపడేది. వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ఆమె ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో 10రోజుల క్రితం తల్లిగారి గ్రామం దుంపలపల్లికి వెళ్లింది. తీవ్ర మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నవనీత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షణికావేశంలో..



బాలరాజు(ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): క్షణికావేశంలో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పెద్ద చెప్యాలలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరశురాములు తెలిపిన కథనం ప్రకారం.. పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన గజ్జెల బాలరాజు(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య మాధవి, పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం బాలరాజు మద్యంతాగి వచ్చి పొలంలో వరి తూకం విషయంలో భార్యతో గొడవపడ్డాడు. దీంతో క్షణికావేశంలో తుమ్మ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.